


ఏయూలో సంబరాలు..

విశాఖ: ఏయూ నాక్ ర్యాంకింగ్‌లో అత్యున్నత స్థానాన్ని సాధించడంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



ఘనంగా సహస్ర తులసీదళార్చన

విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు.



సింహగిరిపై తిరు నక్షత్ర పూజలు

సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తిరునక్షత్ర పూజలు నాల్గవ రోజు గురువారం కొనసాగాయి.

న్యూస్‌రీల్

మా పార్టీ వారిని చేర్చుకోవద్దు...

- టీడీపీకి జనసేన షరతు

నర్సీపట్నం: చేరికలను ప్రోత్సహించుకోకుండా టీడీపీ, జనసేన పార్టీలు పరస్పరం ముందుకు సాగడం మేలని జనసేన పార్టీ విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ పేర్కొన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నివాసంలో గురువారం టీడీపీ, జనసేన నాయకుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడుతూ.. టీడీపీ నుంచి జనసేనలోకి వస్తామన్నా.. జనసేన నుంచి టీడీపీలోకి చేరుతామన్నా చేర్చుకోవద్దని అయ్యన్నపాత్రుడికి విజ్ఞప్తి చేశారు. చేరికలను ప్రోత్సహించినట్లయితే రెండు పార్టీల మధ్య రాజకీయంగా విభేదాలు తలెత్తే అవకాశం ఉందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు మినహా ఇతర పార్టీల వ్యక్తులను చేర్చుకోవచ్చన్నారు.

చెరకు రైతుల బకాయిల చెల్లింపునకు రూ.12.4 కోట్లు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతులకు బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం రూ.12 కోట్ల 40 లక్షల గ్రాంట్‌ను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం తెలిపారు. గత సీజన్‌కు సంబంధించి రైతులకు రూ.7 కోట్ల 40 లక్షల చెరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. అదేవిధంగా కార్మికుల జీతభత్యాలు, ఇతర ఫ్యాక్టరీ అవసరాల నిమిత్తం మరో రూ.5 కోట్లు కలిసి మొత్తం రూ.12 కోట్ల 40 లక్షల గ్రాంట్ ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని ధర్మశ్రీ చెప్పారు. ఫైనాన్స్ క్లియరెన్స్ అనంతరం ఫ్యాక్టరీకి నిధులు మంజూరవుతాయని, వెంటనే రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం జరుగుతుందని ధర్మశ్రీ చెప్పారు. కార్మికుల జీతభత్యాల బకాయి కూడా చెల్లిస్తామన్నారు. ఈ నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధర్మశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.

జోరుగా రక్త నమూనాల సేకరణ


- జిల్లాలో నాలుగు ఫైలేరియా సమస్యాత్మక గ్రామాలు



కొరుప్రోలులో రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం: ఫైలేరియా వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫైలేరియా విభాగం సూపర్‌వైజర్ పసుపులేటి శంకర్రావు అన్నారు. కొరుప్రోలు గ్రామంలో గురువారం రాత్రి రక్త పరీక్షలు నిర్వహించారు. పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో సచివాలయ ఏఎన్ఎంలు, గ్రామ వలంటీర్లు, పీహెచ్‌సీ సిబ్బంది కలిసి 9 టీమ్‌లుగా ఏర్పడి సుమారు 500 మంది నుంచి శాంపిల్స్ సేకరించారు. సేకరించిన శాంపిల్స్‌ను పరీక్షలకు పంపిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో నాలుగు పల్లెలను ఫైలేరియా సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారని, ఇప్పటికే రెండు గ్రామాల్లో శాంపిల్స్ సేకరణ పూర్తి చేశామని చెప్పారు. గురువారం రాత్రి కొరుప్రోలు గ్రామంలో శాంపిల్స్ నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో ఎవరికైనా పాజిటివ్ వస్తే వైద్య సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. సచివాలయ ఏఎన్ఎం, గ్రామ వలంటీర్లు సహకరించడంతో శాంపిల్స్ సేకరణ సులభతరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఎంపీహెచ్‌వో ఆదినారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు దేవరాజు, సత్తిబాబు, సహజ పాల్గొన్నారు.

టీ 20కి భారీ బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈ నెల 23న జరగనున్న టీ 20 మ్యాచ్‌కు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. టికెట్ల విక్రయం నుంచి మ్యాచ్‌కు వచ్చే అతిథులు, అంతర్జాతీయ క్రీడాకారుల భద్రత, బందోబస్తుపై గురువారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. శుక్ర, శని వారాల్లో మ్యాచ్ టికెట్లు ఆఫ్‌లైన్‌లో పీఎంపాలెంలోని స్టేడియం బీ గ్రౌండ్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గాజువాకలోని రాజీవ్‌గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో విక్రయిస్తున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే మ్యాచ్‌కు వచ్చే క్రీడాకారులు, అతిథుల బందోబస్తుపై చర్చించారు. అభిమానులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా ఉండేలా పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్లకు కొత్త రూపు!

- ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.138.25 కోట్లు మంజూరు
- వీటిలో బాగా దెబ్బతిన్న రోడ్లకు రూ.66.55 కోట్లు
- గుంతలు పూడ్చడానికి మరో రూ.71.70 కోట్లు
- ఆరు నుంచి తొమ్మిది నెలల్లో పూర్తి కానున్న పనులు



మరమ్మతులు పూర్తయిన మాడుగుల మండలం కేజేపురం-అప్పలరాజుపురం రోడ్డు



పద్మనాభం కొండపైకి వెళ్లే రోడ్డు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రోడ్లు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో పంచాయతీరాజ్ శాఖకు చెందిన కొన్నిచోట్ల రోడ్లు మరమ్మతులకు గురయ్యాయి. మరికొన్ని రోడ్లకు గుంతలు పడ్డాయి. ఇప్పుడు ఇలాంటి రహదార్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నారు. బాగా దెబ్బతిన్న రోడ్ల స్థానంలో లేయర్లతో సరికొత్తగా వేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ అధీనంలోని రోడ్ల పరిస్థితిపై ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం రాష్ట్రంలో 1,035 కిలోమీటర్ల పొడవున 202 పనులకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.784.23 కోట్లను మంజూరు చేసింది. వీటిలో ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి హై ఇంపాక్ట్ (బాగా దెబ్బతిన్న) 20 రోడ్ల పనులు, 89 గుంతల రోడ్ల పనులు ఉన్నాయి. 85 కిలోమీటర్ల మేర హై ఇంపాక్ట్ రోడ్ల పనులకు రూ.66.55 కోట్లు, 263 కిలోమీటర్ల మేర గుంతల రోడ్ల మరమ్మతు పనులకు రూ.71.70 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాల వారీగా చూస్తే విశాఖ జిల్లాలో పద్మనాభం మండల కేంద్రం నుంచి పద్మనాభ స్వామి కొండపైకి వెళ్లే 3 కిలోమీటర్ల హిల్ టాప్ రోడ్డుకు రూ.5 కోట్లు, అనకాపల్లి జిల్లాలో 19 పనులకు రూ.62 కోట్లు మంజూరు చేశారు.

వీటికి ఇటీవల టెండర్లు పిలిచారు. ఇక రోడ్ల గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టడానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వం రూ.71.70 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో మొత్తం 89 పనులను చేపడుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 27 పనులకు రూ.35.59 కోట్లు (118.23 కిలోమీటర్లు), అనకాపల్లి జిల్లాలో 49 పనులకు రూ.32.30 కోట్లు (120 కి.మీలు), విశాఖపట్నం జిల్లాలో 13 పనులకు రూ.3.82 కోట్లు (23.52 కి.మీలు) మంజూరయ్యాయి. వీటిలో ఏఎస్సార్ జిల్లాలో 20 పనులకు టెండర్లు పిలవగా, ఏడు పనులు ప్రారంభమయ్యాయి. అనకాపల్లి జిల్లాలో ఎనిమిది పనులకు, విశాఖ జిల్లాలో 13 పనులకు టెండర్లు పిలిచారు. అనకాపల్లి జిల్లాలో మాడుగుల మండలం కేజేపురం- అప్పలరాజుపురం రోడ్డు, చీడికాడ-కోనాం (వయా సిరిజాం) రోడ్డు పనులు ఇప్పటికే పూర్తి చేశారు. మిగిలిన హై ఇంపాక్ట్ రోడ్లు, గుంతలు పూడ్చే పనులు ఆరు నుంచి తొమ్మిది నెలల్లో పూర్తి చేయనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు 'సాక్షి'కి చెప్పారు.

27 నుంచి కులగణన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- అన్ని వర్గాల నుంచి సూచనలకు ఆహ్వానం
- అర్థవంతంగా జరిగేలా సహకరించండి
- రౌండ్ టేబుల్ సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఈనెల 27వ తేదీ నుంచి చేపట్టనున్న కులగణన అర్థవంతంగా జరిగేలా అన్ని వర్గాల వారు సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసమిస్తూ జిల్లాలోని వివిధ వర్గాలకు చెందిన నాయకులు, ప్రముఖుల నుంచి అభిప్రాయాలను తెలుసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఈనెల 27వ తేదీ నుంచి ఇంటి సర్వే నిర్వహిస్తామని చెప్పారు. అంతకు ముందుగా వివిధ కులాలు, సామాజిక వర్గాల నాయకులు, ప్రముఖులు అందించే సలహాలు, సూచనలు, అభ్యంతరాలను విశాఖపట్నంలో జరిగే రీజనల్ కమిటీ సమావేశానికి పంపించడం జరుగుతుందన్నారు. వివిధ కులాలకు సంబంధించి ప్రస్తుత సామాజిక స్థితి, విద్య, ఆర్థిక పురోభివృద్ధి గురించి వాస్తవ పరిస్థితులను తెలియజేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, వివిధ సంఘాల నాయకుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 17, 18 తేదీలలో ఎంపిక చేసిన జిల్లా, డివిజనల్ అధికారులకు శిక్షణ తరగతులు జరుగుతాయని, 20-22 తేదీలలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి మాట్లాడుతూ కులగణనలో ఎదురయ్యే సమస్యలు, వాటిని ఏ విధంగా నమోదు చేయాలనే విషయం తెలియజేశారు. ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యుడు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలలో ఉన్న నిరుపేదలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు వీలుగా కొత్తగా కులగణనను చేయాలని సంకల్పించారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, బీసీ సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి, సీపీవో జి.రామారావు, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి, డ్వామా పీడీ ఇ.సందీప్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్ బాబు, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యువో నాగ శిరీష, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహ సత్యవతి, గవర, యాత, నగర, నాగవంశం కార్పొరేషన్ల చైర్మన్లు బొడ్డేడ ప్రసాద్, వి.అప్పలకొండమ్మ పిల్లి సుజాత, బొడ్డు అప్పలకొండమ్మ, కొప్పుల వెలమ పెరికల జంగం కార్పొరేషన్ డైరెక్టర్లు గొర్లె అప్పలనాయుడు, జగదీష్, ఎ.సోమేశ్వరరావు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా గిరిబాబు



గిరిబాబును అభినందిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్, జెడ్పీటీసీలు

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌గా సుంకర గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీలు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో వైస్ చైర్‌పర్సన్ పదవికి ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీకి చెందిన 25 మంది జెడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్, ముంచంగిపుట్టు జెడ్పీటీసీ సభ్యురాలు జె.సుభద్ర.. పద్మనాభం జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు పేరును వైస్ చైర్‌పర్సన్ పదవికి ప్రతిపాదించారు. పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు బలపరిచారు. ఈ పదవికి మరొకరి పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో గిరిబాబు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన వైస్ చైర్‌పర్సన్ గిరిబాబును భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జెడ్పీటీసీ సభ్యులు అభినందించారు. అనంతరం గిరిబాబు మాట్లాడుతూ తనకు వైస్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నెరవేరుస్తానని చెప్పారు.

హృద్రోగులకు వరం టెనెక్టప్లేస్ ఇంజక్షన్

- నక్కపల్లి ఆస్పత్రిలో అందుబాటులోకి..



టెనెక్టప్లేస్ ఇంజక్షన్

నక్కపల్లి: హృద్రోగుల ప్రాణాలు కాపాడేందుకు వేలాది రూపాయల విలువైన ఇంజక్షన్లను ప్రభుత్వం నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో ఉంచింది. బయట మార్కెట్‌లో రూ.46 వేలు కలిగిన ఈ ఇంజక్షన్‌ను నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో సబ్సిడీ పోను రూ.23 వేలకే సరఫరా చేస్తోంది. టెనెక్టప్లేస్ (టీఎన్‌కే-టీపీఏ 40 మిల్లీగ్రాములు) ఇంజక్షన్ గుండెపోటు వచ్చిన వారికి వెంటనే చేస్తే వారు ప్రాణాపాయం నుంచి బయటపడతారు. బయట ఈ ఇంజక్షన్‌కు మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం నక్కపల్లి ఆస్పత్రిలో రెండు వేల్స్‌ను అందుబాటులో ఉంచింది. గుండెనొప్పితో ఆస్పత్రికి వచ్చిన వారికి వెంటనే ఈసీజీ తీసి కంప్యూటర్ ద్వారా విశాఖ కేజీహెచ్‌లో ఉన్న కార్డియాలజీ విభాగానికి పంపిస్తారు. అక్కడ వైద్య నిపుణులు ఈసీజీ పరిశీలించిన తర్వాత రోగికి ఈ ఇంజక్షన్ అవసరమైతే సిఫార్సు చేస్తారు. వెంటనే అందుబాటులో ఉన్న ఇంజక్షన్‌ను రోగికి ఇవ్వడం వల్ల ప్రాణాలు కాపాడగలమని వైద్యులు తెలిపారు. ఇప్పటికే నక్కపల్లి ఆస్పత్రిలో ఈ ఇంజక్షన్ చేసి ఇద్దరిని రక్షించామని సూపరింటెండెంట్ ఈశ్వర ప్రసాద్ తెలిపారు. ఇంజక్షన్ వివరాలను గురువారం ఆయన ఎంపీ డాక్టర్ సత్యవతికి వివరించారు. ప్రస్తుతం రెండు డోసులు అందుబాటులో ఉన్నాయని, ఇవి వాడిన తర్వాత మరో రెండు డోసులు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు.

20న మాజీ ఉపరాష్ట్రపతి రాక

మహారాణిపేట: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ నెల 20న విశాఖ వస్తున్నారు. ఆ రోజు ఉదయం 9.05 గంటలకు ఇండిగో విమానంలో విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి పోర్టు గెస్ట్ హౌస్‌కు చేరుకుని.. బస చేస్తారు. 21న పోర్టు గెస్ట్ హౌస్‌లోనే ఉంటారు. 22న ఉదయం బీచ్‌రోడ్డులోని పార్క్ హోటల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. 23న పోర్టు గెస్ట్ హౌస్‌లోనే బస చేస్తారు. 24న ఉదయం 11 గంటలకు రాజ్యసభ మాజీ సభ్యుడు, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ 70వ జన్మదిన వేడుకల్లో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం 4.35 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానంలో విజయవాడ బయలుదేరుతారు.

పేదల జీవన ప్రమాణాలు మెరుగు



సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- నవరత్నాల సంక్షేమ పథకాలతో బడుగులకు ఆర్థిక భరోసా
- సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రాష్ట్రానికి మళ్లీ జగన్ సీఎం కావాలి
- దేవరాపల్లి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి : పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ధ్యేయంగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలంతా ముక్త కంఠంతో కోరుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి సచివాలయం 1,2 పరిధిలో స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, మా నమ్మకం నువ్వే జగన్...కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డులను, వైఎస్సార్‌సీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా నవరత్న పథకాలను సీఎం జగన్ అమలు చేసి సంక్షేమానికి సరికొత్త నిర్వచనం తీసుకువచ్చారన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ పథకాల మంజూరుకు లంచాలు వసూలు చేసి కొందరికే పరిమితం చేయగా, సీఎం జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. దేవరాపల్లి సచివాలయం-1,-2 పరిధిలో సంక్షేమ పథకాల నిమిత్తం డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ. 57.64 కోట్లు లబ్ధిదారులకు అందజేశామని, అభివృద్ధి పనులు నిమిత్తం రూ.26.20 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దేవరాపల్లిలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తారురోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధి, రూ.రెండు కోట్లతో నూతన ఎంపీడీవో భవనం నిర్మాణం, రూ.1.70 కోట్లతో అదనపు ఆస్పత్రి భవనం నిర్మాణం, రూ.50 లక్షలతో పార్కు నిర్మాణ పనులు చేపట్టినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వరదపురెడ్డి, మండల ప్రత్యేక అధికారి వి. రవీంద్రనాథ్, ఎంపీడీవో సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని, పశు సంవర్ధకశాఖ ఏడీ బైరాగి పాల్గొన్నారు.

పేదల చెంతకు అత్యుత్తమ వైద్యం

- వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని ఆస్పత్రుల స్థాయి పెంపు
- వైద్య సిబ్బంది సీఎం జగన్ ఆశయం నెరవేర్చాలి
- 50 పడకల ఆస్పత్రులుగా కోటవురట్ల, నక్కపల్లి సీహెచ్‌సీలు
- ప్రారంభించిన ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు



కోటవురట్లలోని 50 పడకల ఆస్పత్రి భవనాలను ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: ఆస్పత్రికి వచ్చే రోగుల రుగ్మతల పట్ల చిరాకు పడకుండా భయపెట్టకుండా ఆత్మీయంగా మెలిగి చికిత్స అందించినప్పుడే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం నెరవేరుతుందని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అన్నారు. 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసిన స్థానిక రాజా సాగి సూర్యకాంతమ్మ సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాలను ఆమె ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం జగన్ పేదలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో ఇంటికే వైద్యులను పంపిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రులు అప్‌గ్రేడ్ అయ్యాయని, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉత్తమ సేవలు అందుతున్నాయంటే సీఎం ఆశయం ఎంత గొప్పగా ఉందో అర్థమవుతోందన్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం 50 వరకు కాన్పులు జరుగుతున్నట్టు తెలిసిందని, ఈ సంఖ్యను 200కు పెంచాలని వైద్యులకు సూచించారు. వైద్య పరికరాల కొనుగోలుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, సర్జరీలు, ఆర్థోపెడిక్‌కు సంబంధించిన పరికరాల కోసం ఎంపీ, సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ 2009లో సీహెచ్‌సీకి శంకుస్థాపన జరిగిందని, సీఎం జగన్ ప్రభుత్వంలో నక్కపల్లి, కోటవురట్ల ఆస్పత్రులు 50 పడకల ఆస్పత్రులుగా అభివృద్ధి చెందాయన్నారు. కోటవురట్ల 50 పడకల ఆస్పత్రికి కనీసం రూ.30 లక్షలైనా మంజూరు చేయాలని ఎంపీని కోరారు. అనంతరం కోటవురట్ల-1, 2, సుంకపూరు, యండపల్లి సచివాలయ భవనాలు, యండపల్లి, సుంకపూరు, తంగేడు గ్రామాలలోని ఆర్బీకేలు, కోటవురట్ల-2, తంగేడు, యండపల్లిలోని వెల్‌నెస్ సెంటర్లు, తంగేడు, రామచంద్రపురం జంక్షన్‌లోని బస్ షెల్టర్లను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాస్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.జె.ఎస్.ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్.ఎస్.రామచంద్రరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచులు అనిల్‌కుమార్, పైల శివరామ్, పెన్నాడ నూకరత్నం, జి.పావని, సిహెచ్.కాశీలక్ష్మి, ఎంపీటీసీలు పెట్ల రాంబాబు, వంగలపూడి రాంబాబు, డాక్టర్ విష్ణుమూర్తి, మాజీ ఎంపీపీ వరహాలమ్మ పాల్గొన్నారు.

నక్కపల్లిలో క్రిటికల్ కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి

నక్కపల్లి: నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించానని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి తెలిపారు. గురువారం ఆమె ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో కలసి 30 పడకల నుంచి 50 పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేసిన నక్కపల్లి ఏరియా ఆస్పత్రిని ప్రారంభించారు. ఎన్నికల సభలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నక్కపల్లి ఆస్పత్రిలో పడకల పెంపునకు రూ.3 కోట్లు కేటాయించడంతో అదనపు భవనాలు నిర్మించారన్నారు. అనకాపల్లి ఆస్పత్రిలో 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ సెంటరు ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ ఈ ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటోందని, సుమారు 25 కిలోమీటర్ల జాతీయ రహదారి పరిధి కలిగి ఉండటంతోపాటు, నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందనున్న నేపథ్యంలో ఈ ఆస్పత్రిని 100 పడకల స్థాయికి పెంచేందుకు కృషి చేస్తానన్నారు. ఇక్కడ అదనంగా ఇన్‌పేషెంట్ వార్డులు, పేయింగ్‌రూమ్స్, డిజిటల్ ఎక్స్‌రే, ఈసీజీ వంటి సదుపాయాలు సమకూరాయన్నారు. ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఈశ్వరప్రసాద్, ఏపీపీఎస్సీ సభ్యుడు సోని వుడ్, ఏపీవీవీపీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి పాల్గొన్నారు.

రూ.కోటితో విలువైన వైద్య పరికరాలు

- హెటిరో కంపెనీ దాతృత్వం

నక్కపల్లి: ఇక్కడి 50 పడకల ఏరియా ఆస్పత్రిలో రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెటిరో కంపెనీ యాజమాన్యం ఆర్థిక సాయం అందించి, ఆధునిక వైద్యపరికరాలను సమకూర్చింది. హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి సూచనతో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, కొత్తగా నిర్మించిన పలు విభాగాలను ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జీఎంలు ప్రభాకర్, సుధాకర్, సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి, రాజారెడ్డి, ఎన్.ఎ.న్.వి.ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

- రూ.19 లక్షల సీఎస్ఆర్ నిధులతో హెటిరో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ సమకూర్చింది. గర్భిణులకు, కిడ్నీలో రాళ్లు, అపెండిసైటిస్‌తో బాధపడుతున్న వారికి దీంతో స్కాన్ చేయవచ్చు.
- రూ.6 లక్షల వ్యయంతో మత్తు స్టేషన్ ఏర్పాటు చేశారు. శస్త్రచికిత్స సమయంలో మత్తు ఇచ్చిన వారికి ఆక్సిజన్ అవసరం అయితే ఈ మిషన్ ద్వారా అందిస్తారు.



అల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు

- రూ.6 లక్షల వ్యయంతో బయోమెడికల్ వేస్టేజ్ రూం
- రూ.15 లక్షల వ్యయంతో రోగులకు సురక్షితమైన తాగునీరు అందించే మినరల్ వాటర్ ప్లాంట్
- సుమారు 5 లక్షల వ్యయంతో గ్రీనరీ, ఇతర చిన్న చిన్న రిపేర్లు
- ఇవి కాకుండా ఎముకలకు సంబంధించి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు రూ.25 లక్షల వ్యయంతో ఆర్థో సీ-ఆర్మ్ మిషన్‌ను సమకూర్చేందుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. ఈ మిషన్ ద్వారా రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు చేతులు ఎముకలు విరిగిన వారికి ఈ ఆస్పత్రిలోనే శస్త్రచికిత్సలు చేయవచ్చు.

క్లుప్తంగా

కొత్తవలస రహదారికి రూ.7.40 కోట్లు మంజూరు

మాడుగుల : ఎన్నో ఏళ్లుగా గిరిజనులు, మైదాన ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్న ప్రధాన రహదారి అయిన మాడుగుల దేవి ఆలయం నుంచి సాగరం మీదుగా డి. గోటివాడ కొత్తవలస పోవు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ గురువారం రాత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలు నాయుడు కృషితో ఏడున్నర కిలోమీటర్ల పొడవైన రహదారికి రూ 7.40 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో తాచేరు మీద బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3.40 కోట్లు వ్యయం కాగా, మిగిలిన రూ.4 కోట్లు రహదారి నిర్మాణానికి వ్యయం చేస్తారన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో ఈ నిధులు మంజూరు చేసారని, ఈ రహదారి నిర్మాణంతో మాడుగుల ప్రజలకు ఈ రహదారి గుండా సాగరం, ఎం.కోడూరు, తదితర ప్రాంతాలకు వెళ్లడానికి సౌలభ్యం ఏర్పడుతుందని తెలిపారు. రహదారి పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: అవంతి కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన మహిళా వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. తామరం అవంతి కళాశాలలో విజయనగరం జేఎన్టీయు పరిధిలో ఉన్న కళాశాలల విద్యార్థులతో అంతర కళాశాలల మహిళా వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 8 కళాశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. శుక్రవారం కూడా ఈ పోటీలు కొనసాగుతాయని, సౌత్ జోన్ పోటీలకు జట్టు ఎంపికలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. ఎంపిక అధికారులుగా ప్రొఫెసర్ రామచంద్రరాజు, జేఎన్టీయు ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్‌లు ఎల్లారీశ్వరి, రాజలక్ష్మి వ్యవహరించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



లక్కోజు సత్యనారాయణ

మునగపాక : మండలంలోని ఉమ్మలాడలోని గుండాల వీధికి చెందిన లక్కోజు సత్యనారాయణ అదృశ్యంపై మునగపాక పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలిలా ఉన్నాయి. సత్యనారాయణ ఈ నెల 14న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. తిరిగి రాత్రికి ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు అతని కోసం వెతకడం ప్రారంభించారు. అయినా ఆచూకీ లేకపోవడంతో మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణ ఆచూకీ తెలిస్తే 7989925322, 9573978530 నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

పోదాం పద యాతర...యలమంచిలి జాతర



ధగధగ మెరిసిపోతున్న శ్రీరాముని రూపం



ఆకట్టుకుంటున్న కుమార స్వామి సెట్టింగ్



ఆకట్టుకుంటున్న చెట్ల సెట్టింగ్



విద్యుత్ దీపాలంకరణలో మసీదు నమూనా

- 80 ఏళ్లుగా పంచరాత్రి ఉత్సవాలు
- ఏటా నాగుల చవితి రోజు భారీ జాతర
- రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- భారీ పోలీసు బందోబస్తు
- అలరిస్తున్న విద్యుద్దీపాలంకరణ

యలమంచిలి(అనకాపల్లి రూరల్) : యలమంచిలిలో ప్రతీ ఏటా దీపావళి నుంచి నాగుల చవితి వరకూ ఐదు రోజుల పాటు పంచరాత్రి ఉత్సవాలు ఎంతో అద్భుతంగా జరుగుతుంటాయి. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే కాకుండా అనేక ప్రాంతాలకు చెందిన పిల్లలు, పెద్దలు యలమంచిలి వెళ్లి, పంచరాత్రి ఉత్సవాలు చూద్దామని ఉవ్విళూరుతుంటారు. శుక్రవారం నాగుల చవితి పండుగను పురస్కరించి పంచరాత్రి ఉత్సవాల జాతర కన్నుల పండువగా జరగనుంది. రెండు లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. పోలీసుబందోబస్తు కూడా భారీగానే ఏర్పాటు చేశారు. పట్టణంలో గత 80 వసంతాల నుంచి పంచరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారి ఆలయం, పాతవీధిలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల వద్ద ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేస్తారు. పార్టీలు, కుల,మతాలకతీతంగా అందరూ కలసికట్టుగా ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తారు.

పిల్లలకు ఎంతో సరదా

యలమంచిలి పంచరాత్రి ఉత్సవాలంటే పిల్లలకు ఎంతో సరదా అని చెప్పాలి. వారికి కావల్సిన ఆట వస్తువులతో పాటు పలు రకాల ఎగ్జిబిషన్లు ఏర్పాటవుతాయి. ఈ సంవత్సరం గుర్రప్ప కల్యాణమండపం వద్ద నిర్వహించిన ఎగ్జిబిషన్ విశేషంగా పిల్లలను ఆకట్టుకుంటోంది. జెయింట్‌వీల్,రంగులరాట్నం, డ్రాగన్ ట్రెన్, తోర తోర, పలు రకాల గేమ్స్ పిల్లలను కట్టిపడేస్తున్నాయి.

కళ్లు మిరుమిట్లు గొలిపేలా విద్యుదలంకరణ

పంచరాత్రి ఉత్సవాలు అనగానే ప్రతి ఏటా యలమంచిలిలో ఐదు రోజుల పాటు ఏర్పాటు చేసే విద్యుద్దీపాలకరణ, సెట్టింగులను చూసేందుకు చాలా మంది వస్తుటారు. కళ్లు మిరుమిట్లు గొలిపే భారీ సెట్టింగులు చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తాయనే చెప్పాలి. యలమంచిలి ప్రధాన రహదారిపై ఎస్‌బీఐ కూడలి, దిమిలిరోడ్డు మార్కెట్ జంక్షన్లు, పాతవీధి, తులసీ నగర్ వీధుల్లో అంతర్గత రహదారుల్లో విద్యుత్‌దీపాలతో ఏర్పాటు చేసిన శ్రీరాముడు, దుర్గాదేవి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, హనుమంతుడు, శివ,పార్వతులు, తదితర సెట్టింగులు ఔరా అన్పిస్తున్నాయి.

నేటి రాత్రి జాతర

ప్రతి ఏటా పంచరాత్రి ఉత్సవాలు నాగుల చవితి రోజున ముగుస్తాయి. శుక్రవారం నాగుల చవితి సందర్భంగా భారీ జనజాతర జరగనుంది. జాతర సందర్భంగా యలమంచిలి ప్రధాన రహదారి సహా ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, దిమిలి రోడ్డు, మార్కెట్ జంక్షన్, ఎస్‌బీఐ రోడ్డు, తులసీనగర్,పాతవీధిలోని పలు వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోతాయి. జాతరలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు,స్టేజీ ప్రోగ్రాంలు సందర్శకులను అలరిస్తాయి. ఈ సందర్భంగా సీఐ గఫూర్ నేతృత్వంలో విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈవ్‌టీజింగ్ జరగకుండా మఫ్టీలో కొందరు పోలీసు సిబ్బందిని నియమించారు. జారత సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలు కేటాయించారు.

దివ్యాంగుడి సొంతింటి కల నెరవేర్చిన ఆడారి



దివ్యాంగుడికి కొత్తగా నిర్మించిన ఇల్లు



సోమునాయుడుకు ఆర్థిక సహాయం అందిస్తున్న సత్యనారాయణ

బుచ్చెయ్యపేట : దివ్యాంగుడి సొంతింటి కలను విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందబాబు సాకారం చేశారు. బుచ్చెయ్యపేట మండలం పెదపూడికి చెందిన వియ్యపు సోమునాయుడు లారీ క్లీనర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. దశాబ్ద కాలం కిందట రాజమండ్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమునాయుడు రెండు కాళ్లతో పాటు ఎడం చేయి పూర్తిగా కోల్పోయాడు. వీల్ కుర్చీకే పరిమితమైన సోమునాయుడు వేరొకరి సహాయం లేనిదే ఏ పని చేసుకోలేడు. వైఎస్సార్ సానుభూతి పరుడు అవడంతో గత ప్రభుత్వంలో ఇతనికి పింఛను, ఇల్లు మంజూరు చేయలేదు. మూడు నెలలు కిందట బుచ్చెయ్యపేట మండలానికి విచ్చేసిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందబాబు దృష్టికి సోమునాయుడు దీన స్థితిని డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్ గోకివాడ వరక్రిష్ణ స్థానిక నాయకులు తీసుకెళ్లారు. పూరిపాకలో నివాసం ఉంటున్న సోమునాయుడుకు సొంత నిధులతో ఇల్లు కట్టించి అందిస్తానని డెయిరీ చైర్మన్ ఆనందబాబు హామీ ఇచ్చారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ద్వారా డెయిరీ చైర్మన్ ఆనందబాబు సుమారు మూడు లక్షలు ఆర్థిక సహాయం చేయడంతో సోమునాయుడు ఇల్లు నిర్మాణం పూర్తి అయింది. ఇంటి నిర్మాణం పూర్తి అవడంతో గురువారం డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, సర్పంచ్ వరక్రిష్ణ, మాజీ ఎంపీటీసీ రాజు, మండల తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు ముచ్చకర్ల అప్పారావు నాయకులు వియ్యపు రాజబాబు, నేమాల సత్యనారాయణ తదితరులు సోమునాయుడుకు కొత్త ఇంటి తాళంను, కొంత నగదును అందించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటే అమితమైన ప్రేమతో దివ్యాంగుడైన సోయునాయుడు తనకు అందించిన ఇంటిపై ముఖ్యమంత్రి ఫొటోతో పాటు తనకు ఇల్లు కట్టించిన ఆడారి ఆనందబాబు పేరుతో ఆనంద నిలయమని పేరు పెట్టుకుని కృతజ్ఞత చాటుకున్నాడు. తనకి ఇల్లు కట్టించిన వారికి, ఇంటి నిర్మాణానికి సహకరించిన వైఎస్సార్‌సీపీ నాయకులకు సోమునాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యరంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం



వివిధ దేశాల ప్రతినిధులతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇన్నోవేషన్ హబ్ హెడ్ లూయిస్ అగెరెస్నాప్

- ఇన్నోవేషన్ భాగస్వాములతో కలిసి విప్లవాత్మక మార్పులు
- వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇన్నోవేషన్ హబ్ హెడ్ లూయిస్ అగెరెస్నాప్
- ఏపీ మెడ్‌టెక్‌జోన్‌లో ముగిసిన 3 రోజుల వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం

సాక్షి, విశాఖపట్నం : వైద్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు నిర్దేశించుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించుకునే దిశగా అడుగులు పడుతున్నాయని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇన్నోవేషన్ హబ్ హెడ్ లూయిస్ అగెరెస్నాప్ అన్నారు. విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆధ్వర్యంలో వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం ముగింపు సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా లూయిస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఆరోగ్య ఆవిష్కరణలకు సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇన్నోవేషన్ భాగస్వాములతో కలిసి వైద్య పరికరాల తయారీలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయన్నారు. దిగువ, మధ్య ఆదాయ దేశాల్లో జాతీయ, స్థానిక ప్రభుత్వాల ఆరోగ్య ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆవిష్కరణల్ని ప్రోత్సహించనున్నామన్నారు. ముఖ్యంగా ప్రాణాంతక వ్యాధులుగా ఉన్న క్యాన్సర్, మధుమేహం, గుండె, కాలేయ సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఆరోగ్య స్థితిగతులకు సంబంధించిన అధునాతన చికిత్సలపై దృష్టిసారించాలని లూయిస్ సూచించారు. నాన్ క్రానిక్ డిసీజెస్(ఎన్‌సీడీ)లతో ఏటా 41 మిలియన్ల మంది మృత్యువాత పడుతుండగా ఇందులో మూడొంతుల మంది దిగువ, మధ్య ఆదాయ దేశాలకు సంబంధించినవారే ఉండటం దురదృష్టకరమన్నారు. ఖర్చుతో కూడుకున్నప్పటికీ వైద్య ఆవిష్కరణలతో లక్షల మంది ప్రాణాల్ని కాపాడగలమని లూయిస్ స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ఫోరంలో 70 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

వారోత్సవాల్లో నర్సీపట్నం ఆదర్శం



వారోత్సవాలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యుడు మహేష్

నర్సీపట్నం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణలో నర్సీపట్నం గ్రంథాలయం రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యులు జె.మహేష్ అన్నారు. శాఖాగ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాల్లో మహేష్, పౌర గ్రంథాలయ శాఖ ఉపసంచాలకుడు రవికుమార్, విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్. వెంకట్రావు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృతనిశ్చయంతో లైబ్రేరియన్ వారోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వారోత్సవాల నిర్వహణలో జిల్లా కాకుండా రాష్ట్రానికే నర్సీపట్నం గ్రంథాలయం ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. గ్రంథాలయాల సేవలను విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు వినియోగించుకోవాలన్నారు. మాట మంతీ కార్యక్రమంలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత లైబ్రేరియన్లు జి.మురళీకృష్ణ, కె.త్రిమూర్తులరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

చెడ్డీ గ్యాంగ్ పట్ల అప్రమత్తంగా ఉండండి



చోడవరం పోలీసులు విడుదల చేసిన పోస్టర్

చోడవరం రూరల్: రాష్ట్రంలో దొంగతనాల్లో కలకలం రేపుతున్న చెడ్డీ గ్యాంగ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆచూకీ తెలిస్తే తక్షణం తమకు సమాచారం అందించాలని కోరుతూ చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఒక గోడపత్రికను విడుదల చేశారు. 15మంది చెడ్డీ గ్యాంగ్ ముఠా ఫొటోలతో విడుదల చేసిన బహిరంగ ప్రకటనలో ఎవరైనా ఇల్లు విడిచి బయటకు వెళ్లేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తాళాలు వేయడమే గాకుండా పోలీసువారికి తెలియపరచాలని కోరారు. ఫొటోలలో ఉన్న వ్యక్తులు లేదా, ఎవరైనా అపరిచిత వ్యక్తులు తమ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్టయితే తక్షణం తమకు తెలియచేయాలని ఆయన కోరారు.

భూసేకరణపై అభ్యంతరాలు



ఏవో సూర్యనారాయణకు అభ్యంతరాలను తెలియజేస్తున్న భవన యజమానులు

నర్సీపట్నం: నర్సీపట్నం మెయిన్‌రోడ్డు విస్తరణకు అవసరమైన భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యంతరాలకు సమయం ముగుస్తుండడంతో గురువారం కొంత మంది భవన యజమానులు ఆర్డీవో కార్యాలయ ఏవో సూర్యనారాయణకు వినతులు అందజేశారు. రోడ్డు వంద అడుగులకు విస్తరించాల్సిన అవసరం లేదని, 80 అడుగులకు విస్తరిస్తే ఎవరికీ నష్టం జరగదని భవన యజమానులు అభ్యంతర పత్రాల్లో పేర్కొన్నారు. వంద అడుగులకు అవసరమైన భూమి తీసుకుంటే నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించాలని అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. అభ్యంతరాలు తెలియజేసిన వారందరికీ నోటీసు జారీ చేసి వారి సందేహాలను నివృత్తి చేస్తామని ఆర్డీవో జయరాం తెలిపారు. ల్యాండ్ అక్విజేషన్‌కు ఇచ్చిన మొదటి నోటిఫికేషన్ గడువు ముగిస్తుండడంతో, కొద్ది రోజుల్లో రెండవ నోటిఫికేషన్ ఇస్తామని ఆర్డీవో తెలిపారు.

ఏపీ సెట్ మెంబర్ సెక్రటరీగా జగన్నాథరాజు



వీసీ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య రాజు

ఏయూక్యాంపస్: రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష (ఏపీ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టు–ఏపీసెట్) మెంబర్ సెక్రటరీగా ఏయూ కెమికల్ ఇంజనీరింగ్ విభాగ ఆచార్యులు జి.ఎం.జగన్నాథరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జీవో జారీ చేసింది. ఈ సందర్భంగా ఆచార్య జి.ఎం.జగన్నాథ రాజును ఏయూ వీసీ పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏపీ సెట్ పూర్వ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లలో ఘనంగా సహకార వారోత్సవాలు



డీసీసీబీ డైరెక్టర్ మహాలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

చోడవరం రూరల్ : మండలంలోని రాయపురాజుపేట, జన్నవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో గురువారం సహకార వారోత్సవాలు నిర్వహించారు. రాయపురాజుపేట పీఏసీఎస్‌లో సహకార పతాకాన్ని సంఘ పర్సన్ ఇంఛార్జి బొడ్డేడ సూర్యనారాయణ ఆవిష్కరించారు. ఏపీ స్టేట్ సహకార ఉద్యోగుల సంఘం నుంచి జి.సోమేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని సహకార రంగం అభివృద్ధిని వివరించారు. సంఘ లాభనష్టాలను పర్సన్ ఇంఛార్జి వెల్లడించారు. సంఘ డైరెక్టర్లు సన్యాసిరావు, నూకరాజు, మండల వైస్సార్‌సీపీ అధ్యక్షుడు వెంకటరావు పాల్గొన్నారు. జన్న వరం పీఏసీఎస్ పర్సన్ ఇంఛార్జి, డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల మహాలక్ష్మి అధ్యక్షతన సొసైటీ పరిధిలోని బెన్నవోలు గ్రామంలో సహకార వారోత్సవ సభను నిర్వహించారు. డీసీసీబీ చోడవరం బ్రాంచి సిబ్బంది సహకార రుణాలను, వాటి పరిమితులు, లాభాలను వివరించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ మహాలక్ష్మిని సత్కరించారు. గ్రామ సర్పంచ్ మూడెడ్ల శంకరరావు పాల్గొన్నారు.

నూతన సభా వేదికకు ప్రారంభోత్సవం



సభావేదికను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేతో స్థానిక నేతలు

మాకవరపాలెం: నూతనంగా నిర్మించిన సభా వేదికను అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ప్రారంభించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో రూ.10 లక్షల ఎంపీ నిధులతో సభావేదికను నిర్మించారు. ఈ నేపథ్యంలో ఈ వేదికను గురువారం సాయంత్రం ఎంపీ, ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభావేదికకు నిధులు మంజూరు చేసిన ఎంపీతోపాటు ఎమ్మెల్యేలను గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు, గౌరవ అధ్యక్షుడు రాజు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు వాసు, వుమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచ గ్రామాలకు తీపికబురు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం
- ఇళ్ల మరమ్మతులకు అనుమతి




పంచగ్రామాల వ్యూ

సింహాచలం: పంచ గ్రామాల ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏళ్ల తరబడి ఇళ్ల మరమ్మతుల కోసం ఎదురు చూసున్న నివాసితులకు ఊరట కల్పించింది. ఏ ప్రభుత్వం తీసుకోని సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని.. ఇళ్లు మరమ్మతులు చేసుకునే వీలు కల్పిస్తూ అధికారికంగా మెమో జారీ చేసింది. దీంతో శిథిలావస్థలో ఉన్న ఇళ్ల నివాసితుల బాధలు తొలగనున్నాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంతో పంచ గ్రామాలు ముడిపడి ఉన్నాయి. అడవివరం, వేపగుంట, చీమలాపల్లి, వెంకటాపురం, పురుషోత్తపురం గ్రామాల్లోని దేవస్థానం భూములకు సంబంధించి 1996–97 నుంచి భూ వివాదం నడుస్తోంది. అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలోనే.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పంచ గ్రామాల భూ సమస్య ప్రారంభమైంది. అప్పటి చినగదిలి, పెందుర్తి తహసీల్దార్లు రైత్వారీ పట్టాలు దేవస్థానానికి ఇవ్వడంతో ఈ సమస్య మొదలైంది. దీంతో 27 ఏళ్లుగా భూ సమస్య ఉంది. గడిచిన కొన్నేళ్లుగా ఇళ్ల మరమ్మతులు కూడా చేసుకోని పరిస్థితి నెలకుంది. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లోనే పలువురు కాలం వెళ్లదీస్తున్నారు. వర్షం వచ్చినా, ఎండ వచ్చినా బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. ఓ పక్క పంచ గ్రామాల భూ సమస్య పరిష్కరించాలని, మరో పక్క ఇళ్ల మరమ్మతులకు అనుమతివ్వాలని ప్రజలు ఎప్పటికప్పుడు తమ గోడు వినిపిస్తున్నారు. ఈ విషయంపై గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించేందుకు కంకణం కట్టుకున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే ఈ సమస్య పరిష్కారానికి కమిటీ వేశారు. ఆ తర్వాత ఆ కమిటీలను విస్తరించారు. సమస్య కోర్టు పరిధిలో ఉండడంతో ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. నివాసితుల బాధలను అర్థం చేసుకున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను మరమ్మతులు చేసుకునే విధంగా సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పంచ గ్రామాల్లోని ఇళ్లను మరమ్మతులు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలెవన్ మెమో జారీ చేశారు.

మెమోలోని అంశాలివీ..

- ప్రస్తుతం ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఎలా ఉన్నాయో.. వాటిని మాత్రమే మరమ్మతులు చేసుకోవాలి.
- మరమ్మతులకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ముందుగా దేవస్థానానికి నివాసితులు అందించాలి. ప్రతీ అంశం క్షుణ్ణంగా పరిశీలించి దేవస్థానం అనుమతి ఇవ్వాలి.
- మరమ్మతులు తప్పించి.. మరెలాంటి నిర్మాణాలు గానీ, అదనంగా ఎటువంటి మార్పులు చేయడానికి వీలు లేదు.
- ఎప్పటికప్పుడు ఆ నిర్మాణాలను దేవస్థానం విజిలెన్స్ విభాగం పరిశీలించాలి.

అన్ని వివరాలతో ప్రకటన జారీ చేస్తాం



పంచ గ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం జారీ చేసిన మెమోకి సంబంధించి అన్ని వివరాలతో ప్రకటన జారీ చేస్తాం. ఈ విషయంపై కలెక్టర్‌తో చర్చిస్తాం. ఎవరైతే ఇళ్లు కట్టుకుని ఉంటున్నారో వారి ఇళ్లకు మరమ్మతులు చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. త్వరలోనే నివాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. – ఎస్.శ్రీనివాసమూర్తి, ఈవో, సింహాచలం దేవస్థానం

క్లుప్తంగా

మండల స్థాయి కబడ్డీ పోటీలు నేడు

కశింకోట: కశింకోటలోని కనకమహాలక్ష్మి వీధిలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు కనక మహాలక్ష్మి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, కోశాధికారి ఆళ్ల శ్రీను తెలిపారు. విజేత జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు వరుసగా రూ.10,116, రూ.4,116, రూ.2,116 లు అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన జట్లు పోటీల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

దళిత కాలనీల్లో మౌలిక వసతులకు వినతి


శిరీషారాణికి వినతిపత్రం అందిస్తున్న మధుబాబు

అనకాపల్లిటౌన్: జిల్లాలోని దళితవాడల్లో మౌలిక సదుపాయాలపై దృష్టిసారించాలని, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు కోరారు. ఈ మేరకు రేబాకలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో జిల్లా అధికారిణి శిరీషారాణికి గురువారం వినతిపత్రం అందించారు. దళిత కాలనీల్లో డ్రైనేజీలు నిర్మించక అక్కడ నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ సరిగాలేదన్నారు. తాగునీటి సమస్య కూడా వేధిస్తోందన్నారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆ వినతిలో పేర్కొన్నారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు


డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వెంకటరమణ, జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: స్థానిక నర్సింగరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌వీధిలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను జీవీఎంసీ జెడ్సీ ఎస్.వెంకటరమణతో కలిసి 82వ వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వారి వెంట ఏఈ సుమిత్ర, సిబ్బంది, సచివాలయ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 2,572 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,730	4,210
రెండో రకం	3,560	4,050
మూడోరకం	3,300	3,630

అనకాపల్లి సినిమాలు

మై నేమ్ ఈజ్ శృతి	: రాజా
మా ఊరి పొలిమేర-2	: సత్యనారాయణస్క్రీన్-1
స్పార్క్	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్‌తండ	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
టైగర్-3	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 16 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైనవారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(97036 19706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 436 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 395 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

విజృంభిస్తున్న విషజ్వరాలు


కాలువలో పేరుకుపోయిన చెత్త

వాతావరణంలో ఆకస్మిక మార్పులతో వైరస్ విజృంభిస్తోంది. దగ్గు, జ్వరాలు దడ పుట్టిస్తున్నాయి. దగ్గు, రోజుల తరబడి తగ్గని జ్వరాలతో రోగులు ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వీటినుంచి తప్పించుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. ఈ మేరకు ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.


ఎన్టీఆర్ వైద్యాలయంలో ఓపీ కౌంటర్ వద్ద రోగుల క్యూ

- వాతావరణ మార్పులతో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- విష జ్వరాల నియంత్రణపై వైద్యాధికారుల సూచనలు
- ఫ్రైడే డ్రైడేపై ప్రజలకు విస్తృత అవగాహన

తుమ్మపాల: పట్టణం, మండలంలో గత కొద్ది రోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సాధారణ వైరల్ ఫీవర్‌కు భిన్నంగా దగ్గు, కాళ్లు, చేతుల నొప్పులతో జ్వరం, జ్వరం తగ్గినా నొప్పులు తగ్గకపోవడంతో బాధితులు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో వాతావరణ మార్పులకు వచ్చిన జ్వరాల కన్నా ప్రస్తుతం జ్వరాల తీవ్రత విపరీతంగా పెరిగింది. కొన్ని చోట్ల టైఫాయిడ్, మలేరియా జ్వరాలు అధికంగా నమోదై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎన్టీఆర్ అసుపత్రితో పాటు పట్టణంలోని ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రుల వద్ద రోగులు క్యూ కడుతున్నారు.

ఫ్రైడే డ్రైడే తప్పనిసరి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ చాలా వరకు వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు. అందుకే ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అధికారులు చెబుతున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు. ఇంట్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు ఖాళీ చేసి, పాత్రల్ని ఆరబెట్టాలి. ఫ్రిజ్, కూలర్ వంటి పరికరాల్లో నిల్వ నీటిని తొలగించాలి. ఇంటి ముంగిట వ్యర్థాల్లేకుండా చూసుకోవాలి. కుండీలు, మట్టి పాత్రలు, ప్లాస్టిక్ పరికరాలు, ఖాళీ కొబ్బరి బొండాలు, పాడైన టైర్లలో నీరు నిలిచిపోకుండా చూడాలి. వీటిపై ఇప్పటికే ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రజారోగ్య విభాగం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది.

జ్వరాల నివారణపై జాగ్రత్తలు

- జ్వరం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యం, మందుల షాపులపై ఆధారపడకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి.
- వీలైనంత విశ్రాంతి తీసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- యాంటీబయాటిక్ మందులు, దగ్గు సిరప్‌లు ఇష్టారీతిన వాడకుండా, వైద్యులు సూచించిన మందులనే వినియోగించాలి.
- దుమ్ము, ధూళి, పొగ ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- ఆస్తమా, సుగర్ ఉన్నవాళ్లు దగ్గు తీవ్రత పెరుగుతున్నట్లనిపించినా, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

వారం రోజులు ఇబ్బందిపడ్డాను

వారం రోజులు జ్వరం, దగ్గుతో బాధపడ్డా. బాగా వచ్చి నీరసం వచ్చింది. ప్రైవేట్ మందుల షాపు వారిచ్చిన మందులు వాడినా నయం కాలేదు. ఇక లాభం లేదనుకుని, పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించుకున్నా. వైద్య పరీక్షలు చేసి ఇంజక్షన్, మందులు ఇచ్చారు. గ్రామంలో ఏఎన్ఎం ఇంటికే వచ్చి మరికొన్ని మందులిచ్చింది. రెండు రోజుల్లో నయం అయ్యింది.

– **కరణం అప్పలనాయుడు**, మార్టూరు గ్రామం

ముందస్తుగా మందుల పంపిణీ

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో నేరుగా ఇంటికే వెళ్లి అవసరమైన మందుల్ని ముందుగానే అందిస్తున్నాం. కొన్ని గ్రామాల్లో సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. అలాంటి గ్రామాల్లో వైద్య సిబ్బంది ద్వారా సమాచారం సేకరిస్తున్నాం. వెంటనే రోగుల ఇంటి వద్దకు వెళ్లి పరీక్షలు చేసి, మందులిస్తున్నాం. వైరల్ జ్వరాల వ్యాప్తికి అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉన్నాం.

– **డాక్టర్ వాణి**, పీహెచ్‌సీ వైద్యురాలు, తుమ్మపాల

డ్రైడేపై విస్తృత ప్రచారం

వాతవరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు వస్తుంటాయి. వాటి నివారణకు అన్ని చోట్ల ఫ్రైడే డ్రైడే, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. వీటిలో ప్రజలను భాగస్వాముల్ని చేస్తున్నాం. చిన్నచిన్న జాగ్రత్తలతో చాలా రోగాల నుంచి తప్పించుకోవచ్చు. పట్టణంలో పరిశుభ్రతపై ప్రతి రోజూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

–**వెంకటరమణ**, జోనల్ కమిషనర్, అనకాపల్లి జోన్

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

కశింకోట: నాగుల చవితి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసారి చవితి తిథి రెండు రోజులు ఉండటంతో శుక్రవారం కూడా చాలా మంది జరుపుకోనున్నారు. చవితి సందర్భంగా రైతులు తమ సమీపంలోని పుట్టల వద్దకు వెళ్లి పాలు, కోడి గుడ్లు వేసి నాగేంద్రుడిని పూజించారు.

నాగుల చవితి పురస్కరించుకుని స్థానిక గాడి వీధిలో ఉన్న పురాతన నాగేంద్రస్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది. ఈ సందర్భంగా స్వామి ఆలయాన్ని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. భక్తులు కోడిగుడ్లు, పాలు, చిమిలి తదితరాలను పుట్టలో వేసి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నాగుల చవితి రెండో రోజు శుక్రవారం కూడా ప్రత్యేక పూజలు జరపనున్నట్లు ఆలయ నిర్వాహకుడు తిమ్మాపతిని సత్యనారాయణ తెలిపారు. చవితి సందర్భంగా ఆలయం వద్ద సాయంత్రం కోలాటాలు, తోడపెద్దు సేవ, చిటికె భజనలు ఏర్పాటు చేశారు. నాగుల చవితి పురస్కరించుకుని గవరపేటలోని దుర్గమాంబ ఆలయం వద్ద మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.


కశింకోట గాడివీధి నాగేంద్రస్వామి ఆలయంలో నాగేంద్రుడికి ప్రత్యేక అలంకరణ


కశింకోటలోని గవరపేటలో దుర్గమాంబ ఆలయం వద్ద మహిళల కోలాట ప్రదర్శన

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నిదానం దొడ్డి సత్యసాయిబాబా మందిరంలో గురువారం బాబా 98వ జయంతి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. తెల్లవారుజామున 4 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగరసంకీర్తన, 6 గంటలకు బాబా చాలీసా పారాయణం జరిగాయి. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ సత్యసాయిని దర్శించుకుని, బాబా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 23న జరిగే జయంతి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ దంపతులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబ్జీ, పార్టీ శ్రేణులు ధీరజ్, వామాల కాశి, కటారి దేముడు, బుద్ధ జగన్, పలకా కాసులు, రేబాక ఇంద్రకుమార్, కొణతాల సన్యాసినాయుడు, సత్యసాయిబాబా సేవాసమితి సభ్యులు మళ్ల సత్యసాయి, కొణతాల మహేశ్వరనాయుడు, కొణతాల సూరిరావు, కె.సోమేష్, ఎం.గౌతమ్, ఎం.బాలు, ఎం.స్వామి, ఎన్.దీపక్, వై.మాధవరావు, భక్తులు పాల్గొన్నారు.


సత్యసాయిబాబాను దర్శించుకుంటున్న దాడి రత్నాకర్

నాగదుర్గమ్మ జాతర మహోత్సవం నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక బెల్లం మార్కెట్ ఆవరణలో వేంచేసిన నాగదుర్గమ్మ జాతర మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు వర్తక సంఘ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో అమ్మవారి పుట్టలో ఉదయం 6 గంటలకు పాలుపోసి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్కెట్ ఆవరణలో సాయంత్రం 4 గంటల నుంచి నేలవేషాలు జరగనున్నాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి వేగి త్రినాథ్ ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబి డ్యాన్స్, రింగ్ రోడ్డు మళ్ల బ్రదర్స్ వద్ద చినరామ యంగ్‌టైగర్స్ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆన్‌ఫైర్ డ్యాన్స్ హంగామాతో పాటు రేలా రే రేలా, కూడిపూడి నృత్యప్రదర్శన, బుర్రకథ, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. మందుగుండు సీతారామయ్య ఆర్థిక సహాయంతో బాణసంచా విన్యాసాలు జాతర ప్రియులను ఆకట్టుకోనున్నాయి.


నాగ దుర్గమ్మ

యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పంచదార్ల

అనకాపల్లిటౌన్: అనకాపల్లి నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా పంచదార్ల సూరిబాబు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక నర్సింగరావుపేట సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి రాముయాదవ్, గౌరవాధ్యక్షుడిగా గోకివాడ శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొల్లి నాగు, వర్కింగ్ సెక్రటరీగా కుండల రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా యేదూరి అప్పలరాజు, కోశాధికారిగా అయితా రాము, ఉపాధ్యక్షులుగా ముచ్చి కొండల రావు, బోయిన రమణ, వాయిబోయిన నర్సింగ్, కురందాసు నాయుడు, కొయ్య భాస్కరరావు, ప్రచార కార్యదర్శిగా నంబారు సత్యారావు, మీడియోసెల్ అధ్యక్షుడిగా బొట్టా శ్రీను, అధికార ప్రతినిధిగా మొల్లి భాను, సమన్వయకర్తగా బర్ల నాగరాజు, సలహాదారుగా గోకివాడ నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరణికాన సాయినాథరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సబ్బి శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ కమిటీ రెండేళ్ల మనుగడలో ఉంటుందని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు భరణికాన నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు వియ్యపు సింహాచలం, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బంధం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

శరవేగంగా సుంకరమెట్ట రహదారి విస్తరణ

అనకాపల్లిటౌన్: జాతీయ రహదారి జలగల మదుం జంక్షన్ నుంచి పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ వరకూ రూ.కోటీ 96 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక సుంకరమెట్ట జంక్షన్ రహదారి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ రహదారి గోతులమయంగా ఉండడంతో హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి రోడ్డు వేయించినట్లు పేర్కొన్నారు. రహదారి విస్తరణ పూర్తయిన వెంటనే ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలను అధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో 80వ వార్డు పార్టీ ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, జీవీఎంసీ ఈఈ చిరంజీవి, పార్టీ నేతలు శిలపరశెట్టి బాబి, రేబాక ఇంద్రకుమార్, ఆళ్ల ప్రవీణ్, మళ్ల రామచంద్రరావు, మొల్లి రమణబాబు పాల్గొన్నారు.


సుంకరమెట్ట జంక్షన్ రహదారి పనులు పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

సుంకరమెట్ట రోడ్డు విస్తరణలో అభ్యంతరాలు తెలపండి

డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ జోన్-7 పరిధి అనకాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకు ప్రధాన రహదారికి అనుసంధానించే 100 అడుగుల వెడల్పు గల సుంకరమెట్ట రహదారి విస్తరణకు సంబంధించి వివరాలను జోన్-7 జోనల్ కార్యాలయం, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రదర్శించినట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ గురువారం తెలిపారు. వాటిపై అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. నిర్వాసితులుగా 97 మందిని గుర్తించామని, వారి పేర్లు, ఫోన్ నెంబర్లతో పాటు కోల్పోయిన స్థల వివరాలు అందుబాటులో ఉంచామన్నారు. వారికి సంబంధించిన అంశాల్లో అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోగా తెలియజేయాలన్నారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, నిబంధనల మేరకు టీడీఆర్ బాండ్లు జారీ చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు


తాళ్లపాలెంలో గ్రంథాలయ అవశ్యకతపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


గ్రంథాలయ ఉద్యమకర్తల ఫొటోలకు నివాళులు

కశింకోట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజైన గురువారం కశింకోటలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు తెలుగు పద్యాలు, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. విశ్రాంత హెచ్ఎం వీవీ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన పద్య పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్ర లేఖనం పోటీలను బాలికల హైస్కూల్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పీవీఆర్ రమేష్ నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.వరలక్ష్మి, బీసీ హాస్టల్ వార్డెన్ అప్పారావు పాల్గొన్నారు.

- మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉపయోగాలను వివరిస్తూ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాయల మురళీధర్, గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం


శ్రీరాంనగర్ సచివాలయం-2లో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత


శ్రీరాంనగర్లో సంక్షేమ పథకాల బ్రోచర్లతో ప్రజలు, కార్పొరేటర్ సునీత, రామ్మూర్తి


మారేడుపూడిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు, సాలాపు కనకరాజు

అనకాపల్లిటౌన్: గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం తమ ప్రభుత్వంతోనే సాధ్యమైందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. సచివాలయం-2 పరిధి శ్రీరాంనగర్‌కాలనీలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ ఆధ్వర్యంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం జరిగింది. ముందుగా సచివాలయం పరిధిలో అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రూ.21.42 కోట్ల మేరకు లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను సీఎంగా గెలిపించుకుని, మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని పొందాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి మాట్లాడుతూ రూరల్ జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న వైద్యాలయాన్ని అభివృద్ధి చేసింది తమ ప్రభుత్వమేనన్నారు. వైద్యపోస్టుల ఖాళీలను భర్తీ చేసి పేదలకు జగన్ నాణ్యమైన వైద్యం అందిస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మాట్లాడుతూ సచివాలయాల ఏర్పాటు ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కారానికి నోచుకున్నాయన్నారు. అంతకు ముందు శ్రీరాంనగర్‌కాలనీ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను అందించారు. అక్కడే పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో జెడ్సీ ఎస్.వెంకటరమణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మరో డైరెక్టర్ మునూరు శ్రీను, వైఎస్సార్‌సీపీ నేతలు అనురాధ, ఉగ్గిన శ్రీను, అప్పారావు, పలకా సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


మారేడుపూడిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్


కస్పావీధిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి

మారేడుపూడిలో..

మండలంలోని మారేడుపూడి సచివాలయ పరిధిలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ హాజరై మాట్లాడారు. సచివాలయ పరిధిలో సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ప్రజల చెంతకు వచ్చి సేవలందించేలా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చారన్నారు. అంతకు ముందు మారేడుపూడి రహదారిలో పార్టీ జెండా ఆవిష్కరించి, సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేశారు. పల్లె నిద్ర చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాలాపు కనకరాజు, సచివాలయ కన్వీనర్లు జి.వెంకునాయుడు, శేఖర్, రాజేష్, ఎంపీటీసీ ఈగల రామునాయుడు, ఎంపీడీవో కె.నర్సింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈగల కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కశింకోట: రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. కశింకోటలోని 4వ సచివాలయం పరిధిలో ప్రజలకు అందించిన పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే బోర్డును గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల సంక్షేమానికి నవ రత్నాలు, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తూ జన రంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. ఇలాంటి సీఎం మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ సచివాలయ పరిధిలో ప్రత్యక్ష, పరోక్షంగా రూ.28.78 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్లను పంపిణీచేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కస్పా వీధిలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, సర్పంచ్ మంత్రి జయ రజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సబ్ జైల్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

అనకాపల్లిటౌన్: స్థానిక సబ్ జైల్లో ఖైదీల తాగునీటి వసతికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయనున్నట్లు ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో జైలు సూపరింటెండెంట్ వైఎస్ గణేష్ కలిసి ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆమె భరోసానిచ్చారు. బల్లా నాగభూషణం, డి.దుర్గా భవానీరావు, మైలపల్లి నూకరాజు పాల్గొన్నారు.


ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న సబ్ జైలు సూపరింటెండెంట్ గణేష్

వారపు సంతకు నాగుల చవితి కళ

కశింకోట: స్థానిక వారపు సంత గురువారం కళకళలాడింది. రెండు రోజులు నాగుల చవితి కావడంతో పూజా ద్రవ్యాలు, కూరగాయలు ఎక్కువగా కొనుగోలు చేశారు. కలగూరలో వినియోగించే కాయగూరల అమ్మకాలు ఎక్కువగా సాగాయి. పువ్వులు, కోడి గుడ్లు, వివిధ రకాల పత్రి, అరటి పండ్లు విక్రయాలు జరిగాయి. నాగుల తువ్వాళ్లు కూడా ఎక్కువగా కొనుగోలు చేశారు. దుకాణాల్లో రాగి పిండి, నువ్వు పప్పు, బెల్లం అమ్మకాలు ఎక్కువగా సాగాయి.